# కోరికలు - సంసారం

సంసారమనగా భార్యాబిడ్డలు, ధన, కనక, వస్తు, వాహనాదులతో కూడుకొని యుండుట అని అందరం భావించెదము. ఇవియే మనకు దుఃఖ కారణములని భావించుచున్నాము. మరి ఇవి ఏవియూ లేని సన్యాసులు కూడ వీధులలో తిరుగుచూ ఆహారము మరియూ ఇతర అవసరముల కొఱకు బాధలనుభవించుట చూచుచున్నాము. మరి వారు సంసారులు కారా? వారు కూడ భవసాగరములో సతమతమవుచున్నారు. కావున సంసారమనగా...

**తృష్ణ ఏవతు సంసారో తన్నాశో ముక్తి రుచ్యతే**
**యత్ర యత్ర భవేత్ తృష్ణః సంసారం విద్ధి తత్రవై (అష్టావక్రగీత 10-3,4)**

కోరికలే సంసారం. అవి నశించుటయే మోక్షమని పిలవబడుచున్నది. కోరికలెచటనుండునో సంసారమచ్చట పదిలముగానుండును. కావున బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమములలో నుండువారికి, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములవారందరికీ ఏదో విధంగా కోరికలుండును కనుక వీరందరూ సంసారులే. సంసారమును 'భవసాగర' మనియూ, 'భవరోగ' మనియూ పిలుచుచున్నాము. కోరికలే సంసారము కనుక, కోరికలు అనంతము కనుక, దీనిని సంసారముతో పోల్చుచున్నారు.

**ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్య వైరిణా**
**కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేనచ (భ.గీ. 3-39)**

అగ్నిలో కట్టెలు వేయుచున్నకొలదీ అది వృద్ధి చెందుచునే యున్నట్లు, కోరికలు తీర్చుటకు ప్రయత్నము చేయుచున్న కొలదీ అవి వృద్ధి చెందుచునే ఉండును.

**'కర్మణా వర్తతే కర్మీ, తత్త్యాగాచ్ఛాంతి మాప్నుయాత్' (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ -15)**

కర్మలు చేయుచున్నకొలదీ, కర్మలు పెరుగుచునే యుండును. వాటిని త్యజించినచో శాంతి లభించునని శృతి చెప్పుచున్నది.

**'యద్యద్ధి కురుతే కర్మ తత్తత్కామస్య చేష్టితమ్' (బృహదారణ్యకోపనిషత్)**

ఏయే కర్మలు చేయుచున్నామో అవి అన్నియూ కోరికలతో కూడుకొన్నవే.

కోరికలవలన కర్మలుచేయుట, కర్మలుచేయుట వలన కోరికలు పెరుగుట జరుగుచుండును. అందుచే...

**యథా నిరింధనో వహ్నిః స్వయమేవోపశామ్యతి**
**తథా వృత్తి క్షయాచ్చిత్తం స్వయమేవోపశామ్యతి** **(మైత్రేయోపనిషత్ 1-7)**

అగ్నిలో కట్టెలు వేయకపోయినచో అది స్వయంగా ఉపశమించును. అదే ప్రకారం మనసులోని వృత్తులు అనగా దృశ్య వృత్తులు లేదా కామచింతన నశించినచో మనసుకూడ స్వయముగా ఉపశమించి, బ్రహ్మస్వరూపమగును.

**'యోగశ్చిత్త వృత్తి నిరోధః'** **(పతంజలి యోగసూత్రం)**

చిత్తవృత్తులను నిరోధము చేయునది యోగము. కనుక కోరికలు నశించుటకు చిత్త చాంచల్యము నరికట్టు యోగసాధనయే ముఖ్యం.

**వృత్తి హీనం మనః కృత్వా క్షేత్రజ్ఞం పరమాత్మని**
**ఏకీకృత్య విముచ్యేత ముఖ్యోయం యోగ ఉచ్యతే** **(అష్టావక్ర గీత)**

మనసులోని వృత్తులను పోగొట్టి, క్షేత్రజ్ఞుడగు జీవాత్మను పరమాత్మయందు ఐక్యము చేయు ఉపాయము యోగమొక్కటే.

**సన్న్యస్య స్సర్వ కర్మాణి భవ బంధ విముక్తయే** **(వివేక చూడామణి-10)**

భవ బంధ విముక్తి కొఱకు సర్వ కర్మలనూ విడిచిపెట్ట వలెనని జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యుల వారు సెలవిచ్చియున్నారు. అయితే కర్మలు చేయకుండా ఎవరైనా ఉండగలరా?

**న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతి జైర్గుణైః** **(భ.గీ. 3-5)**

ఒక్క క్షణము కూడ కర్మ చేయకుండా ఉండలేరనియూ, కర్మ చేయకుండా శరీర యాత్ర జరుగుట అసంభవమని గీత చెప్పుచున్నది. శరీరము ధరించువారు కర్మలు చేయుట తప్పనిసరి అగునప్పుడు కోరికలను జయించుట ఎట్లు? మరి సంసారమును దాటుట ఎట్లు? అను సంశయము వచ్చును. మొదట శరీర నిర్మాణము ఆ తరువాత కోరికలు, సంసారము వచ్చుచున్నవి.

**ఊర్ధ్వమూల మధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్**
**ఛంధాంసి యస్య పర్ణాని యస్తంవేద సవేదవిత్ (భ.గీ. 15-1)**

మన శరీరంలో సంసారమను వృక్షమొకటి కలదనియూ, దాని మొదలు, పైభాగమున అనగా భ్రూమధ్యమునందును, శాఖలు క్రింది భాగము అనగా శిరస్సునకు దిగువన ఇతర అవయవములయందును కలదని, జ్ఞానము కలిగినచో ఈ వృక్షము రేపు అనునది లేకుండా వెంటనే నశించుచుననియూ, చెట్టును ఆకులు రక్షించుచున్నట్లు వేదములలో చెప్పబడిన కర్మానుష్ఠానము చేసినచో ఈ సంసారవృక్షము పదిలముగా నుండుననియూ గీతలోని భావము.

**'మహత్పదం జ్ఞాత్వా వృక్షమూలే వశేత' (సుబాలోపనిషత్ 13-1)**

బ్రహ్మపదమునొంది, వృక్షమూలమగు శిరోభాగము నందే ఉండమని శృత్యర్థము. మనలోగల జీవశక్తి లేదా ప్రాణశక్తి ప్రతి శ్వాసక్రియలోను అనగా నిశ్వాసంలో అథోగతి చెందుచుండుటచే రానురాను శరీర భాగమేర్పడి సంసార వృక్షము పెరుగుచున్నది. దేహాత్మ భావన, పంచేంద్రియములతో కూడి ప్రపంచ భావన ఏర్పడుట తోడనే కర్మలు చేయుట, మరల కోరికలు కలుగుట ఈ చక్రములో పడుటయే సంసారము. ఎవరు తన ప్రాణశక్తిని ఊర్ధ్వముగా నడిపింతురో అనగా ప్రాణాయామమాచరింతురో, వారి ప్రాణశక్తి తిరిగి భ్రూమధ్యములో చేరి సంసారవృక్ష మూలమందుండుటచే వారి సంసారము వెనువెంటనే నశించును.

**'యోగేన గత కామానాం భావనా బ్రహ్మచక్షసే' (ఉత్తరగీత 1-9)**

యోగము వలననే కోరికలను జయించి పిదప బ్రహ్మప్రాప్తి నొందెదరు. కావున తన ప్రాణశక్తిని యథాతథంగా క్రిందకి విడుచువారెవరైననూ, అనగా ఏ వర్ణాశ్రమములలో నుండు వారైననూ సంసారులే. యోగి ఒక్కరే సంసారమును దాటగలరు.

**యోగ సన్న్యస్త కర్మాణం జ్ఞానసంఛిన్న సంశయమ్**
**ఆత్మ వంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ (భ.గీ. 4-41)**

యోగము వలన కర్మలను సన్న్యసించి, జ్ఞానము వలన సంశయ నివృత్తి నొందిన యోగి, కర్మలను చేసిననూ, ఆత్మయందే రమించుచుండుటచే బంధింపబడడు. కావున

బహిర్ముఖుడై కర్మలను చేసినచో సంసారం, అంతర్ముఖుడై కర్మలను చేసినచో సంసారము నుండి విరమణ అని పై వివరణ సారాంశము. అందుచే...

**యుక్త్య యుక్తస్య మర్త్యస్య సంసారం సాగరాన్వితం**
**యుక్తి యుక్తస్య మర్త్యస్య సంసారం గోష్పదాన్వితం** **(శృతి)**

యోగసాధన చేయని వారికి సంసారము సాగరము వంటిదని, యోగసాధన చేయువారికి సంసారము గోపాదమంత స్వల్ప పరిమాణములో నుండునని శృతి అర్ధము.